# లాస్ట్ మెసేజ్

బెజ్జారపు వినోద్ కుమార్

"అన్నయ్యా నాకు చాలా భయంగా వుంది".

జీవితంలో మొదటిసారి ముకుంద గొంతులో అంతటి బేలతనం.

"ఏమయిందమ్మా సుధాకర్‌ను పిలవనా?" అన్నాను.

"వద్దు వద్దు ఆయన గురించి మాట్లాడదామనే నీకు ఫోన్ చేశాను" అంది గాభరాగా.

క్షణకాలం నాకేమీ అర్థం కాలేదు.

తల తిప్పి చూశాను. ఫైల్స్ సర్దుతూ వెళ్ళడానికి తయారవుతున్నాడు సుధాకర్.

"చెప్పమ్మా ఏంటీ విషయం?"

"ఫోన్‌లో చెప్పేది కాదు. రేపొకసారి ఇంటికి రాగలవా ప్లీజ్" అంది బతిమాలుతూ.

"అలాగే" అనేసి ఫోన్ పెట్టేశాను.

ఇటు తిరిగి సుధాకర్‌ను పలుకరిద్దామనుకునే సరికి వెళ్ళిపోతూ కనిపించాడు.

"ఏరా సుధా ఇంటికేనా, నేనూ వస్తాను" అన్నాను.

"వద్దు. దారిలో నాకు వేరే పనులున్నాయి" అనేసి నా మాటకోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

నాలో క్యూరియాసిటీ.

వాడికి తెలియకుండానే నా బైకుపై వాడిని ఫాలో అయ్యాను.

వాడి స్కూటర్ సరాసరి వెళ్ళి ఆగిన చోటును చూసి షాకయ్యాను.

అది బార్ షాపు.

ఆల్కహాల్‌కు ఇరవై కిలోమీటర్ల దూరముండే సుధాకర్ బార్‌షాపులోకి వెళ్ళడం పెద్ద షాకే నాకు.

నిత్యం పూజలు పునస్కారాలతో గడిపే మా సూపర్నెంట్ స్వామిపాదం గారి భార్య మంగళ, ఆదివారాల్లో మందు కొడుతూందని తెలిసినప్పుడు కూడా అంత షాకవ్వలేదు.


సమ్‌థింగ్ రాంగ్.

ఇంటికి వస్తూ ఆలోచించసాగాను.

ఇట్లాంటి సందర్భాలలో నా మెదడు చురుకుగా పనిచేస్తుంది. అంటే మిగతా సందర్భాలలో చురుగ్గా పనిచేయదని కాదు. ఏదైనా సమస్యను సాల్వ్ చేయాల్సిన అవసరం ఏర్పడినప్పుడు దాని మూలాలను వెతకడంతో నా అన్వేషణ మొదలవుతుంది.

మా ఆఫీస్ స్టాఫ్ నుండి మొదలుకుని స్నేహితులు చుట్టాలు అందరికీ నా అన్వేషణలపైన పరిశోధనలపైన చాలా నమ్మకం. ఏమాత్రం నమ్మకంలేని ఏకైక వ్యక్తి మా ఆవిడ సందిత ఒక్కతే. ఎప్పుడైనా తాను పుట్టింటికి వెళితే కందిపప్పు డబ్బా కూడా ఎక్కడుందో తెలియక వెతికీ వెతికీ తిరిగి తనకే ఫోన్ చేసి తెలుసుకునే నా తెలివితేటలపైన చాలా తేలిక భావం.

ప్రతిరోజూ టి.విలలో వచ్చే సీరియల్స్‌లో తరువాత ఏం



జరగబోతోంది? ఫలానా పాత్ర చివరకు ఏమవుతుంది? ఫలానా సీరియల్ ఎన్ని ఎపిసోడ్స్‌లో ముగుస్తుంది లాంటి ప్రశ్నలడుగుతూ కనీసం వీటికి సమాధానాలు కూడా ఊహించడం చేతకాని మీరు బయటమాత్రం పెద్ద అపరాధ పరిశోధకునిలా ఫోజుకొడతారు అని నా పరిశోధనను గంజిలో ఈగలా తీసిపారేస్తుంది.

''వాటికి సమాధానాలు ఆ కథ రాసిన రచయితకే కాదు అతని మెదడును కసాపిసా పిసికి వుండలా చేసి అతని బుర్రలో కూరిన ఆ బ్రహ్మదేవుడికి కూడా తెలియదే'' అని ఎంత మొత్తుకున్నా వినిపించుకోదు.

అందుకే ఇంటికి వచ్చి నాలో నేనే సుధాకర్ విషయం ఆలోచించుకుంటూ వుండిపోయాను గానీ సందితతో మాత్రం చెప్పలేదు.

నాకున్న అతికొద్దిమంది విశ్వసనీయ స్నేహితులలో సుధాకర్ ఒకడు. నమ్మకానికి, మంచితనానికి, ఆర్ద్రతకు చిరునామా వాడు. ముకుంద వాడికి తగిన జోడి. వారిద్దరి మధ్యన బేధాభిప్రాయాలకు తావే లేదు. పుట్టింటి వాళ్ళంతా వ్యతిరేకించినా అన్నింటినీ అందరినీ వదులుకుని బాబా గుడిలో సుధాకర్‌ను వివాహం చేసుకుంది.

ముకుందవైపు నుండి సుధాకర్‌కు ఎదురయ్యే సమస్యలేమీ లేవు.

సుధాకర్ దగ్గర నాకు తెలియని సమస్యలంటూ ఏమీ వుండవు.

అసలు సమస్య ఏమై వుంటుంది?

తెలతెలవారుతుండగా కొద్దిగా నిద్రపట్టింది.

ఇంతలోనే ఘంటసాల గొంతుతో భగవద్గీత వినిపించింది.

''సమస్యలు చెప్పిరావు ఎప్పుడు పోతాయో చెప్పవు. చెప్పిరాని ఎప్పుడు పోతాయో చెప్పని సమస్యల గురించి వర్రీ అవడం వల్ల ప్రయోజనం లేదు..''

''అదేంటి భగవద్గీతలో ఇంగ్లీషు పదాలేంటి?'' అనుకుంటూ దిగ్గున లేచి కూచున్నాను.

''భగవద్గీత ఏంటి? ఇంగ్లీషు పదాలేంటి'' అంది సందిత చిరాగ్గా.

ఇంక లాభం లేదనుకుని లేచి మొహం కడుక్కుని సందిత అందించిన కాఫీ త్రాగి మార్కెట్‌కెళ్ళి కూరగాయలు తీసుకొచ్చి స్నానం చేశానో లేదో ఆఫీసునుండి ఫోన్.

''ఏమయ్యా అర్జంటుగా ఒకసారి ఆఫీసుకు రా'' సూపర్నెంట్ స్వామిపాదం గొంతులో కంగారు.

''నేనివ్వాళ ఆఫీసుకు సెలవు పెట్టాను సార్. రావడానికి వీలుపడదు'' అన్నాను.

''ఏం?''

''పర్సనల్ సార్''

''కానీ నువ్వు అర్జంటుగా రావాలి. అకౌంట్స్ గురించి డిస్కస్ చేయాలి?''

''అదేంటి సార్. అకౌంటెంట్ సుధాకర్ వున్నాడు కదా''

''సుధాకర్ గురించే మాట్లాడాలి తొందరగా రా'' అన్నాడు






కొమ్మూరి సాంబశివరావు స్మారక పోటీలో
బహుమతి పొందిన కథ

సీరియస్‌గా.

ఝల్లుమంది నాకు.

ఏమయింది ఉన్నట్టుండి సుధాకర్ ఇంత ప్రముఖ వ్యక్తి ఎలా అయిపోయాడు?

గబగబా తయారయ్యి ఆఫీసుకు బయల్దేరాను.

వెళ్లేసరికి సూపరెంటెంట్ తన సీట్లో అసహనంగా కదులుతూ వున్నాడు. ఫ్యాన్ గాలి హైస్పీడ్‌లో వున్నా బట్టతల నుంచి మొహంవరకూ చెమటలు కారుతూనే వున్నాయి.

''చెప్పండి సార్ విషయం'' అన్నాను.

''సుధాకర్ ఎంతపని చేశాడో తెలుసా?''

''ఏం చేశాడు?''

''దామిని ఎంటర్‌ప్రైజెస్ వారికివ్వడానికని డ్రా చేసిన ఐదు లక్షల రూపాయలను తన స్వంతానికి వాడుకున్నాడు'' అన్నాడు సూపరెంటెంట్.

ఇది నేనూహించని పరిణామం. కోలుకోవడానికి చాలా టైం పట్టింది.

''సార్ మీరుగానీ పొరపాటుపడ్డంలేదు కదా''

''లేదు. అతను డబ్బు డ్రాచేసి వారం రోజులవుతోంది. ఈరోజు ఉదయం ఎంటర్‌ప్రైజెస్ వాళ్ళు వచ్చి డబ్బులు అడిగేసరికి నేనూ షాకయ్యాను. డెబిట్స్, క్రెడిట్స్ బ్యాలెన్స్ షీట్ చెక్ చేద్దామంటే ఈరోజు ఆఫీసుకు రాలేదు'' అన్నాడు సూపరెంటెంట్.

చాలాసేపు మౌనంగా వుండిపోయాను.

''మరి ఏం చేద్దామనుకుంటున్నారు?'' అడిగాను మెల్లిగా.

''మూడు రోజుల్లో సి.ఇ.ఓ. గారి ఇన్‌స్పెక్షన్ వుంది. ఈలోగా డబ్బు సర్దుబాటు అయి పేమెంట్ చేసేస్తే నో ప్రాబ్లం'' అన్నాడు.

కొద్దిసేపు కళ్ళు మూసుకుని ఆలోచించాను.

''డబ్బును సుధాకర్ ఏం చేశాడనేది ఎందుకిలా చేశాడనేది తెలుసుకోవడానికి మూడురోజుల టైం ఎక్కువే. కాని డబ్బు ఆల్రెడీ ఖర్చయిపోతేనో''

ఇంక ఆలోచించదల్చుకోలేదు. సమస్య ఎదురైనప్పుడు మనం వృథా చేసే ఒక్క క్షణంలో కూడా ఎన్నో పరిణామాలు జరగవచ్చు.

సూపరెంటెంట్‌తో అన్నాను.

''థాంక్యూ సార్, ఈ విషయం ఎవరితోనూ చెప్పనందుకు''

''లేదయ్యా ఒక వ్యక్తికి తెలుసు''

''ఎవరికి?''

''మా ఆవిడకు''

సడెన్‌గా గుర్తొచ్చింది నిన్న మంగళవారమని.

''అంటే మీకీ విషయం...''

''నిన్ననే తెలుసోయ్. మా ఆవిడ మాటమీదే ఈ విషయం లీక్ చేయలేదు''.

''సరే సార్ వస్తా...'' అనేసి బయటకొచ్చాను.

బండి స్టార్ట్ చేసుకుని వెళ్ళి దస్తగిరి పాన్‌టేలా వద్ద ఆగాను.

నేనెప్పుడైనా కేస్ ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టినప్పుడు మాత్రమే సిగరెట్ తాగడం స్టార్ట్ చేస్తాను. తిరిగి ఇన్వెస్టిగేషన్ పూర్తి కాగానే మానేస్తాను.

పాన్‌టేలా దగ్గర ఆగగానే దస్తగిరి కళ్ళలో మెరుపు. వాడు కేస్ అయిపోయేదాకా సిగరెట్లు

## రచయిత పరిచయం



### బెజ్జారపు వినోద్‌కుమార్

**పు**ట్టింది 1965 సంవత్సరం కోరుట్లలో, చదువు ఎం.ఎ., బి.ఇడి. 1989లో టీచర్‌గా ఉద్యోగం. ప్రస్తుతం కథలాపూర్ మండల రిసోర్స్ పర్సన్. మొదటి కథ అచ్చయింది 1987లో. ఇప్పటి వరకు అచ్చయిన కథలు 70కి పైగా. అచ్చయిన కథల సంపుటి 'గవ్వలమూట'. భార్య రమ, ఇద్దరు పాపలు యామినీ కౌముది, దామినీ కిరణ్. కథల పోటీల్లో బహుమతి గెలవడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి.

ఫ్రీగా ఇస్తాడు. డబ్బులు తీసుకోడు. కేసు అయిపోయాక మాత్రం వివరాలు చెప్పేదాకా ఊరుకోడు.

''రండి సార్'' అనేసి కింగ్‌సైజ్ రెడ్‌విల్స్ చేతిలో వుంచి ఒక చేత్తో నీళ్ళబాటిల్, మరో చేత్తో విక్స్ గోళీ పట్టుకుని రెడీగా నిలుచున్నాడు. సిగరెట్ అంటించి పొగ పీల్చగానే ధారాళమైన దగ్గు బయటకు తన్నుకొచ్చింది. వెంటనే దస్తగిరి అందించిన నీళ్ళు తాగి విక్స్ గోళీ నోటిలో వేసుకుని బయల్దేరాను.

సరాసరి సుధాకర్ ఇంటిముందర బండి ఆపాను.

బండి చప్పుడు వినగానే పరుగెత్తుకుంటూ వచ్చింది ముకుంద. ఆమె మొహమంతా ఆందోళన నిండివుంది.

లోపలికి వెళ్ళి కూచోగానే అడిగాను.

''సుధాకర్ ఎక్కడ?''

సమాధానంగా ఆమె కళ్ళల్లోని నీళ్ళు టపటపా కిందకు రాలాయి.

''ఏమయిందమ్మా... విషయం తెలియాలిగా..''

క్షణాల్లో మామూలు మనిషైపోయింది.

''నిజానికి నిన్న ఇంకా తీవ్రమైన దుఃఖంతో వున్నాను. ఎప్పుడైతే నీకు ఫోన్ చేశానో అప్పటి నుండే నాకు ధైర్యం వచ్చింది'' అంది ముకుంద రాగిమాల్ట్ అందిస్తూ.

నాకు రాగిమాల్ట్ తాగడం అలవాటు.

''నాకోసం ఇంత శ్రమపడి రాగిమాల్ట్ ఎక్కడ కొన్నారమ్మా చాలా బాగుంది''

''కొనలేదు. వారం రోజుల క్రితం మీ ఇంటికొచ్చినప్పుడు టేస్టు చూడమని సందిత ఇచ్చింది. ఎవరూ తాగక అలా మిగిలిపోయింది'' అంది ముకుంద.

''సరేగానీ విషయమేమిటో చెప్పు?'' అన్నాను.

చెప్పడం మొదలెట్టింది.

''ఓ పదిరోజుల క్రితం వరకూ తాను బానే వుండేవాడు. ఏమయిందో తెలియదుగానీ హఠాత్తుగా ఒకరోజు రాతిరంతా మెలకువతోనే వున్నాడు. ఏం ఆలోచించాడో ఏమోగానీ ఆరోజు నుండి ముభావంగా వుండడం, ఆందోళనగా వుండడం, పిల్లలతో నాతో సరిగ్గా వుండకపోవడం...'' దుఃఖంతో ఆగిపోయింది.

''అరే... ఆఫీసులో నేనంతగా గమనించలేదు... వర్క్‌లోడ్ ఎక్కువై'' అన్నాను.

సుధాకర్ ఐదు లక్షల ఆఫీసు డబ్బు వాడుకున్న విషయం ముకుందతో చెప్పదల్చుకోలేదు.

''ఆయన ముభావంగా వుండడం, ఆందోళనగా వుండడం ఆఫీసులో పెరిగిన పనిభారం వల్లనేమో అనుకుని ఊరుకున్నాను''.

''ఈమధ్య తాగి వస్తున్నట్లున్నాడు?'' అన్నాను కోపంగా.

''ఛ ఆయనెప్పుడూ తాగలేదు''

''లేదమ్మా నిన్న వాడు బార్‌షాపుకు వెళ్ళడం చూశాను''.

''ఓ అదా... ఆ బార్‌షాప్ ఓనర్ చిట్టీలు నడుపుతాడు. ఈమధ్యనే ఆయన దగ్గిర రెండు లక్షల చిట్టీ కడుతున్నాము. పేమెంట్ చేయడానికి వెళ్ళుంటాడు'' అంది.

బతికిపోయాను. ఈ టైంలో గనుక సందిత వుంటే ఈ క్షణాన ఆమె నన్ను చూసే చూపులకు తల కొట్టేసినట్టయ్యేది.

మళ్ళీ తనే చెప్పసాగింది.

''నిన్న ఉదయం అనుకోకుండా బీరువా సర్దుతూంటే అందులో వుండాల్సిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్స్ ఏవీ కనబడలేదు. ఏమయ్యాయని అడిగితే డబ్బు అవసరమై డ్రా చేశాను, అన్నీ నీకు చెప్పాలా అని విసుక్కున్నాడే తప్ప ఏ విషయమూ చెప్పలేదు. ఎంత చిన్నపాటి ఖర్చయినా ఎంత చిన్న ఇన్వెస్ట్‌మెంటయినా నన్నడగకుండా ఏదీ చేయడు. ఆఖరికి పాప పేరు మీద డిపాజిట్ చేసిన డబ్బు కూడా...'' దుఃఖం ఆగలేదామెకు.

''ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో ఎంత డబ్బుందమ్మా?''

''సుమారు ఐదారు లక్షల వరకు వస్తాయి''

గ్లాసులో వున్న నీళ్ళు గటగటా తాగేశాను.

సుధాకర్ సమస్య నేననుకున్నంత మామూలుది కాదనిపించింది. తవ్వినకొద్దీ ఎన్నో రహస్యాలు అరబ్ దేశాల్లో పెట్రోలు తన్నుకొచ్చినట్టు తన్నుకొస్తాయనిపించింది.

కేసు ఎంత జటిలమవుతుంటే అంత చురుకుగా పనిచేస్తుంది నా మెదడు. కేసు చప్పగా వుంటే వన్‌సైడెడ్‌గా మారిన వన్‌డే మ్యాచ్‌లా నీరసంగా అనిపిస్తుంది.

అటూఇటూ ఇబ్బందిగా దిక్కులు చూస్తున్న నన్ను పసిగట్టింది ముకుంద.

''ఫరవాలేదన్నయ్యా. ఇలాంటి సమయాల్లో మీరు సిగరెట్ తాగుతారని తెలుసు'' అంటూ లోపలికి వెళ్ళి అగ్గిపెట్టె, నీళ్ళ బాటిల్, విక్స్ గోళీ తీసుకొచ్చి టేబుల్‌పై పెట్టి లోపలికి వెళ్ళిపోయింది.

లోపలికెళ్ళిన ముకుంద కొద్దిసేపటికే గాభరా పడుతూ బయటకొచ్చింది.

''అన్నయ్యా బీరువాలో నగలు కనిపించడం లేదు''

''ఎంత విలువ చేస్తాయేం?''

''సుమారు లక్షన్నర''

ముకుందను మరికొన్ని వివరాలడిగి బయట కొచ్చాను.

ముకుంద చెప్పిన వివరాల ప్రకారం ఈ మధ్యన వారికి ఎదురైన సమస్యలు ఏమీలేవు.

ఏ విషయమైనా ముకుందకు చెప్పందే చేయని సుధాకర్ ఈ విషయం మాత్రం దాస్తున్నాడూ అంటే అది కేవలం సుధాకర్‌కు సంబంధించిందీ మరియు ముకుందకు చెప్పకూడనిదీ అయి వుంటుంది.

అలాంటి విషయం ఒక్కటే... ఇతర స్త్రీతో అక్రమ సంబంధం.

సుధాకర్ విషయంలో అలా ఊహించడానికే ఇబ్బందిగా అనిపించింది.

సాయంత్రం లోపల సుధాకర్ సేకరించిన మొత్తం డబ్బు వివరాలు ఆరాతీశాను.

ఆఫీసు డబ్బు అయిదు లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు కాన్సిల్ చేయగా వచ్చిన డబ్బు ఆరు లక్షలు, బార్‌షాప్ ఓనర్ దగ్గర చిట్టీ ఎత్తిన డబ్బు లక్షన్నర, నగలు అమ్మగా వచ్చిన లక్షన్నర, మరో రెండుచోట్ల చేసిన అప్పు రెండు లక్షలు... సుమారు పద్దెనిమిది లక్షల వరకు డబ్బు సేకరించాడు సుధాకర్.

ఒకేసారి ఇంత డబ్బు సుధాకర్‌కు ఏం అవసరమొచ్చింది?

ఏ వస్తువు కొనాలన్నా, ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ముకుందతోగానీ, నాతోగానీ, సందితతోగానీ డిస్కస్ చేయకుండా ఏ పనీ చేయడు. మూణ్ణెల్ల నుంచి ముప్పైవేల విలువ చేసే కంప్యూటర్ కొనడానికి ఎంతో తిరిగి, ఆరాతీసి నన్ను ముకుందను వెంట తీసుకుని మరీ వెళ్ళి కొన్నాడు. అలాంటిది ఇంత పెద్ద రహస్యం ఏమై వుంటుంది?

పాన్‌టేలా దస్తగిరిలాంటి అభిమానులు ఈ ఊళ్ళో చాలామందే వున్నారు నాకు. సమాచార సేకరణకోసం ఎక్కువగా వారిపైనే ఆధారపడతాను.

గత పదిరోజులుగా సుధాకర్ ప్రవర్తన అతను వెళ్ళిన స్థలాల గురించి ఎంక్వయిరీ చేయడానికి ఒక పూట సమయం గడిచిపోయింది నాకు.

గత పదిరోజులుగా సుధాకర్ డబ్బు సేకరణ గురించి మినహా మరెక్కడికీ వెళ్ళలేదు. ఈమధ్య కాలంలో వాడికి కొత్తగా పరిచయం అయినవారెవరూ లేరు. కొత్తగా అలవాటయిన వ్యసనాలు కూడా ఏమీ లేవు. రెండుమూడుసార్లు సుధాకర్‌తో మాట్లాడదామని చూసినా వాడు చిరాకుపడ్డాడు గానీ నాతో ఏమీ చెప్పలేదు. వాడికి ఏకోశానా నాకు విషయం చెప్పడం ఇష్టంలేదని అర్థమైపోయింది. నిద్రపోయేవాళ్ళను లేపొచ్చుగానీ నిద్ర నటించేవాళ్ళను లేపలేమనే నానుడి గుర్తొచ్చింది.

ఏదైనా సమాచారంకోసం వెతికితే దొరకనప్పుడు సమాచారం తనంతట తానుగా అందేట్లుగా పరిస్థితులను కల్పించాలనేది నేను నమ్మే సిద్ధాంతం.

చెరువు గట్టుమీద కూచుని సెల్‌ఫోన్‌లో బాక్స్ వరల్డ్ ఆట ఆడటం మొదలుపెట్టాను. బాక్స్‌వరల్డ్ ఆటలు చాలా అద్భుతమైనవి. మెదడుకు చాలా పని కల్పిస్తాయా ఆటలు. బాక్స్‌లను డాట్స్‌లో సెట్‌చేయడం, సెట్ అయిన బాక్స్‌లను మరోచోటికి కదల్చడం, ఉన్న దారులు మూసుకుపోకుండా కొత్త దారులను వెతకడం, ఒకసారి దారికి అడ్డంగా వచ్చే బాక్స్‌నే మరోసారి కొత్తదారిని ఏర్పరచుకోవడానికి ఉపయోగించుకోవడం, కొన్నిసార్లు పక్కనే వున్న బాక్స్‌ను కదల్చడం కోసం చుట్టూరా తిరిగి రావడం, కొత్త కోణాల్లో దారులు వెతకడం.

ఆట ఆడుతూనే ఆలోచించసాగాను.

సుధాకర్‌కు బయట ప్రపంచం నుండి ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాలేదు. అటువంటప్పుడు ఇంటిలోని ప్రపంచం ద్వారా సమస్య ఉత్పన్నం కావాలి.

కాని ఇంటిలో ముకుంద, ఇద్దరు పిల్లలు తప్ప మరెవ్వరూ లేరు. వారినుండిగానీ, ముకుంద తరపు వాళ్ళ నుండి గానీ ఎలాంటి సమస్యా ఉత్పన్నం కాలేదు.

వీళ్ళు కాకుండా ఇంటిలో ఇంకేం ప్రపంచముంటుంది.

ఇంటిలో వుండే బయటి ప్రపంచం....

మెరుపులా ఆలోచన మెరిసింది.

చిట్టచివరి డాట్‌లో కూడా బాక్స్ ఫిక్స్ అయిపోయింది.

కంప్యూటర్... మూడు నెలల క్రితం కొన్న కంప్యూటర్.

పాకుతూ పైకి వెళ్ళడానికి గడ్డిపోచలాంటి ఆధారంకోసం వెతుకుతూంటే మర్రి ఊడ దొరికినట్లయింది.

ముకుందకు ఫోన్ చేశాడు.

''చెప్పన్నయ్యా'' అంది.

''ఏమ్మా మనసు కాస్త తేలిక పడినట్లనిపిస్తోంది'' అన్నాను.

''విషయం అంతా నీకు చెప్పేశా కదా'' అంది.

''ఏంలేదు ఒకరోజు రాతిరంతా మెలకువతో వుండి మర్నాటినుండి సుధాకర్ మూడీగా మారిపోయాడన్నావు కదా. ఆరోజు రాత్రంతా ఏం చేశాడు?''

''రాత్రంతా కంప్యూటర్ ముందు కూర్చుని ఇంటర్నెట్ బ్రౌజ్ చేస్తూ వుండిపోయాడు.''

ఆకాశంలో మేఘాలు విచ్చిపోయి వెలుగు కిరణం ప్రత్యక్షమైనట్లనిపించింది.

''దాదాపు ప్రతిరోజూ ఇంటర్నెట్ ముందు కూచుంటాడు. కాని ఆరోజు మాత్రం చాలాసేపు కూచున్నాడు... ఆ తరువాతే నిద్దరపోకుండా మెలకువతో వున్నాడు''.

''సరే... భోంచేశావా?''

''అవును. ఇందాకే చికెన్ బిర్యానీ వండుకున్నాను'' అంది ముకుంద.

ఇంటికి వెళ్ళి ఇంటర్నెట్‌లో ఓ కొత్త ఇ-మెయిల్ ఎకౌంట్ క్రియేట్ చేసి సుధాకర్‌కు ఒక మెసేజి పంపించాను.

''ఈమధ్యన ఒక సైబర్ నేరం మా దృష్టికి వచ్చింది. దానిలో మీరు బాధితులని తెలిసింది. మీకు తెలిసిన సమాచారం మొత్తాన్ని మీ ఇంటి అడ్రస్‌తో సహా మాకు అందించగలరు. లేనట్లయితే మిమ్మల్నీ అనుమానించాల్సి వస్తుంది. ఇట్లు - సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో''.

అనే సందేశాన్ని సుధాకర్‌కు పంపించాను.

రెండు గంటల తరువాత నాకు కావలసిన మెసేజ్ వచ్చింది.

''అలాగే సార్ నాకు తెలిసిన సమాచారం మొత్తం మీకందిస్తాను. నా ఇంటి అడ్రెస్ కూడా పంపిస్తున్నాను'' అంటూ తన ఇంటి అడ్రస్‌తో సహా రిప్లై ఇచ్చాడు సుధాకర్.

''మరో గంట తర్వాత అంటే సరిగ్గా 4.32కు మావాళ్లు మీ ఇంటికి వస్తారు. సహకరించండి'' అని మరో మెయిల్ పంపించాను.

వెంటనే 'అలాగే సార్' అనే మెస్సేజి వచ్చింది.

సరిగ్గా నాలుగు గంటల ముప్పై నిమిషాలకు సుధాకర్ ఇంటి తలుపు తట్టాను.

నన్ను చూసి చాలా కంగారుపడిపోయాడు సుధాకర్.

''ఏరా ఈ టైంలో వచ్చావు... నాకు చాలా పనుంది తరువాత కలుస్తాను వెళ్ళు'' అన్నాడు కంగారుగా.

''ముకుంద కూడా ఇంటిలో లేదు. ఒక్కడివే ఇంటిలో కూచుని ఏం చేస్తున్నావు. ఎవరికోసమైనా ఎదురు చూస్తున్నావా?'' అన్నాను.

''అబ్బే అలాంటిదేం లేదు... నువ్వు వెళ్ళు'' అన్నాడు మరింత కంగారుగా.

''నీకు సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పేరుతో ఇ-మెయిల్ పంపింది నేనే'' అన్నాను.

**ఆఫీసు డబ్బు అయిదు లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు కాన్సిల్ చేయగా వచ్చిన డబ్బు ఆరు లక్షలు, బార్‌షాప్ ఓనర్ దగ్గర చిట్టీ ఎత్తిన డబ్బు లక్షన్నర, నగలు అమ్మగా వచ్చిన లక్షన్నర, మరో రెండుచోట్ల చేసిన అప్పు రెండు లక్షలు... సుమారు పద్దెనిమిది లక్షల వరకు డబ్బు సేకరించాడు సుధాకర్.**

క్షణకాలం నిర్ఘాంతపోయాడు సుధాకర్.

వాడి కళ్ళల్లో నీళ్లు జివ్వున చిమ్మాయి. రెండు రోజులుగా వాడు ప్రదర్శిస్తున్న కోపం, చిరాకు అన్నీ మాయమైపోయి దీనంగా చూశాడు నాకేసి.

''సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఆత్మీయులతో చెప్పుకోవాలనే విషయం నీకు చెప్పాల్సిన అవసరం లేదు. ఏం జరిగిందసలు'' అన్నాను అనునయంగా.

''నేను అనుకోకుండా ఒక పెద్ద నేరంలో ఇరుక్కున్నాను. దానినుండి తప్పించుకోవడం అసాధ్యం. దానికి శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాను. నా ప్రయత్నం ఫలించకపోతే ఆత్మహత్యే శరణ్యం నాకు'' అన్నాడు. వాడి కళ్ళనుండి నీళ్ళు టపటపా రాలాయి.

''ఏం జరిగింది?''

''లండన్‌లో నా కారణంగా ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణం నేనే అనే విషయం బ్రిటిష్ పోలీసులకు తెలిసిపోయింది. వాళ్ళు నాకోసం సెర్చింగ్‌లో వున్నారు. నేడో రేపో నేను అరెస్టు కావచ్చు'' అన్నాడు.

విషయం చాలా సీరియస్ అనుకున్నాను గానీ ఇంత సీరియస్ అని అనుకోలేదు. అసంకల్పితంగానే అలర్ట్ అయిపోయాను.

సుధాకర్ ద్వారా అసలు విషయం ఏమిటో తెలుసుకుంటే సగం ప్రాబ్లం సాల్వ్ అయిపోతుందనుకున్నాను.. కాని అసలైన ఇన్వెస్టిగేషన్‌కు ఇది ప్రారంభం మాత్రమే.

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాను.

''ఒక్క విషయం కూడా పొల్లుపోకుండా, ఏ చిన్న అంశం కూడా మిస్ కాకుండా నాకు వివరంగా చెప్పు'' అని వెనక్కు చేరగిలబడి కళ్ళు మూసుకున్నాను.

చెప్పడం మొదలుపెట్టాడు సుధాకర్.

''కంప్యూటర్ కొన్నాక నెలరోజులకు నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. దానిని పంపించిన అమ్మాయి పేరు మార్తా. లండన్‌లో వుంటుంది''.

''ఏమని పంపింది?''

**కిటికీలోంచి వెన్నెల ప్రవాహంలా వచ్చి బెడ్‌పైన అంతా పర్చుకుంది. అర్ధరాత్రి వరకు కుర్చీలో కూచుని బెడ్‌పైన వెన్నెలనే చూస్తూ వుండిపోయాను. ఆ వెన్నెలకంతా నీ జ్ఞాపకాలైనట్లుగా అనిపించి వెళ్లి బెడ్‌పైన పడుకున్నాను. తెలతెలవారుతుంటే మా అమ్మ వచ్చి చెప్పింది నేను నీ పేరే కలవరించానట నిద్దట్లో...**

''తనకు ఇండియా అన్నా ఇండియన్ ట్రెడిషన్స్ అన్నా చాలా ఇష్టమని''

''అసలు నీ ఇ-మెయిల్ అడ్రస్ ఆమెకెలా తెలుసు?''

''ఒక వెబ్‌సైట్ వారు పెన్‌ఫ్రెండ్‌షిప్ లాగా ఇ-ఫ్రెండ్‌షిప్ అనే ఫీచర్ ఓపెన్ చేశారు. దానికి నా ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పబ్లిష్ చేశారు.

''ఓ.కె. ఆ తరువాత.''

''లండన్‌లో తానుంటున్న పరిసరాల గురించి, వాళ్ళ కుటుంబం గురించి, వాళ్ళ జీవన విధానం గురించి, మానవ సంబంధాల గురించి, తన చిన్ననాటి జ్ఞాపకాల గురించి ఎన్నెన్నో ముచ్చట్లు వివరంగా చెబుతుండేది. ఆమె మెస్సేజ్‌లు చదువుతూంటే షెల్లీ కవితలు చదువుతున్నట్లుగా అనిపించేది. ఇక్కడి నా విషయాలు అన్నీ కూడా వివరంగా అడిగేది. నేనెంతగా అడిక్ట్ అయిపోయానంటే ఒక్క రోజు ఆమె మెయిల్ రాకపోయినా ఎంతో వెలితిగా ఫీలయ్యేవాడిని''.

''ఈ విషయం ముకుందకు తెలుసా?''

''నా జీవితంలో ముకుంద దగ్గర దాచిన ఏకైక విషయమిదే... అందుకే ఇన్ని కష్టాలు''

''సరే తరువాత''

''మా మధ్యన సాన్నిహిత్యం ఎంతగా పెరిగిపోయిందంటే... ఒకరోజు పంపిన మెయిల్ నన్ను కదిలించి వేసింది''

''ఏంటది?''

గబగబా ఇమెయిల్ బాక్స్ ఓపెన్ చేసి ప్రిజర్వ్ చేయబడిన ఒక మెస్సేజ్ చూపించాడు.

''కిటికీలోంచి వెన్నెల ప్రవాహంలా వచ్చి బెడ్‌పైన అంతా పర్చుకుంది. అర్ధరాత్రి వరకు కుర్చీలో కూచుని బెడ్‌పైన వెన్నెలనే చూస్తూ వుండిపోయాను. ఆ వెన్నెలకంతా నీ జ్ఞాపకాలైనట్లుగా అనిపించి వెళ్లి బెడ్‌పైన పడుకున్నాను. తెలతెలవారుతుంటే మా అమ్మ వచ్చి చెప్పింది నేను నీ పేరే కలవరించానట నిద్దట్లో...''

మరో సందర్భంలో అయితే అంత అద్భుతమైన మెసేజ్ అందుకున్న సుధాకర్‌గాడిపైన ఈర్ష్యగా అనిపించేది.

''ఈ వయసులో పెళ్ళయిన ఇన్నేళ్ళ తరువాత ఒక అమ్మాయి నుండి ఇలాంటి మెసేజ్ అందినందుకు థ్రిల్లింగ్‌గా ఫీలయి వుంటావు. రిప్లై కూడా ఇదేస్థాయిలో ఇచ్చివుంటావు అవునా?'' అన్నాను.

''అదేం లేదు''.

''మరి''

''థ్రిల్లయిన మాట నిజమేకానీ నేనిచ్చిన రిప్లైలో తనకు పెళ్ళయి పిల్లలున్న విషయాన్ని ఆమెకు మరోసారి గుర్తు చేస్తూ నాపైన అలాంటి భావనలు పెంచుకోవడం సరికాదని సమాధానమిచ్చాను.''

''తరువాత''

''నేను రిప్లై పంపిన తరువాత ఓ పది రోజులవరకు ఆమెనుండి ఎలాంటి మెస్సేజ్ రాలేదు. నేను పంపిన మెస్సేజ్‌లకు కూడా రిప్లయి రాలేదు. కానీ పదిరోజుల తరువాత...''

''పది రోజుల తరువాత...?'' అడిగాను క్యూరియస్‌గా.

''వేరొక ఇ-మెయిల్ అడ్రస్ నుంచి ఒక మెసేజ్ వచ్చింది...''

''ఏమని...?''

''తాను మార్తా అన్నయ్యనని... తన పేరు జాన్సన్ అని... తన చెల్లెలు మార్త ఆత్మహత్య చేసుకుందని... తన చెల్లెలి నోట్‌బుక్‌లోని నా ఇ-మెయిల్ అడ్రస్ చూసి మెసేజ్ పంపిస్తున్నానని...''

కొత్తమలుపు తిరిగిన కథ చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

''ఆ తరువాత మార్తా నుండి మరెప్పుడూ మెయిల్ రాలేదుగానీ మార్తా అన్నయ్య నుండి మాత్రం వరుసగా మెసేజ్‌లు అందాయి''.

''ఏమని..?''

''తన తల్లిని ఇంటరాగేట్ చేయడం ద్వారా మార్తా ఆత్మహత్యకు కారణం నేను అని బ్రిటిష్ పోలీసులు తెలుసుకున్నారని. నాకోసం అన్వేషణ కొనసాగిస్తున్నారని, అతిత్వరలో ఇండియన్ గవర్నమెంట్ పర్మిషన్‌తో నన్ను బ్రిటన్ తీసుకెళ్ళడానికి ఏర్పాట్లు చేస్తున్నారని... అక్కడ మార్తా ఆత్మహత్యపైన జరుగుతున్న ఇన్వెస్టిగేషన్ పురోగతిని ఎప్పటికప్పుడు మెసేజ్‌ల ద్వారా నాకందిస్తూనే వున్నాడు.

''చిట్టచివరి మెసేజ్ ఎప్పుడు పంపించాడు?'

''పదిరోజుల క్రితం''

''ఏమని?''

''కేసు విషయంలో పోలీసులు చాలా కటువుగా ప్రవర్తిస్తున్నారని.. వారిని మేనేజ్ చేయడానికి ఇండియన్ కరెన్సీ ప్రకారం కనీసం ఇరవై లక్షల రూపాయలు అవసరమవుతాయని, వాటిని సిద్ధం చేసిన తరువాత తనకు మెసేజ్ పంపించమని చెప్పాడు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా దాచమని చెప్పాడు'' చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకోసాగాడు సుధాకర్.

ఇప్పటివరకూ నాకు కేసు విషయం, సుధాకర్ డబ్బు సేకరించడానికి గల కారణం తెలిసివచ్చింది.

ప్రిజర్వ్ చేయబడిన మెస్సేజ్‌లలో అవసరమైన వాటినన్నింటినీ స్టడీ చేశాను. ఈమెయిల్‌లో మార్తా ఫోటోను చూశాను. కళ్ళు తిప్పుకోలేనంత అందంగా వుంది.

తల పైకెత్తి సుధాకర్‌తో అన్నాను.

''ఇదంతా చూశాక ఎవరో నిన్ను కావాలని ఇందులో ఇరికించారనిపిస్తోంది. మార్తా అనే ఒక కల్పిత పాత్రను సృష్టించి, మార్తా పేరుతో నీతో ఇన్నిరోజులూ ఇ-సంబంధాలు పెట్టుకున్న వ్యక్తి లండన్‌లోనే వుండాల్సిన అవసరం లేదు. ప్రపంచంలో ఎక్కడైనా వుండి వుండవచ్చు. అంతదాకా ఎందుకు? నీ ఇంటి ప్రక్క వ్యక్తే అయివుండవచ్చు కూడా'' అన్నాను.

''నీకొచ్చిన అనుమానమే నాకూ వచ్చింది. కానీ మార్తా అనే వ్యక్తి వున్న మాట నిజం. ఆమె లండన్‌లో ఆమె చెప్పిన అడ్రస్‌లో నివసిస్తున్న మాట నిజం''.

''ఎలా?'' అడిగాను.

బీరువాలో అట్టడుగున దాచివున్న ఒక పోస్టల్ కవరు తీసుకొచ్చాడు. అది లండన్ నుండి

వచ్చింది. ఫ్రం మార్తా అని లండన్ అడ్రస్ వుంది,

కవరును జాగ్రత్తగా పరిశీలించాను. పోస్టల్ స్టాంప్స్ ముద్రలు అన్నీ లండన్‌వే వున్నాయి.

కేసు మొదటికొచ్చింది.

మార్తా అనే వ్యక్తి వున్నమాట నిజం.

కొద్దిసేపు ఆలోచించి సుధాకర్‌తో అన్నాను.

''నువ్వు నిర్భయంగా వుండు. రెండు రోజుల్లో నీ కేసు ఫైల్ క్లోజ్ చేస్తా''

''దానితోపాటు నా లైఫ్ క్లోజ్ కాకుండా చూడు'' అన్నాడు దీనంగా.

''ఓ.కె. బీ ఫ్రీ... నేను వెళ్ళాక ప్రస్తుతం ఏం చేస్తావు?''

''రెండ్రోజులుగా ఏమీ తినలేదు.. ముకుంద వండిన బిర్యానీ తింటాను.''

* * *

సరిగ్గా రెండు రోజులు గడిచాక హడావుడిగా ఆఫీసుకు వచ్చాడు సుధాకర్.

''ఒక మెసేజి వచ్చింది'' రాగానే గట్టిగా అరిచాడు.

''ఏమని?''

''ఆశ్చర్యంగా మార్తా ఇ-మెయిల్ అడ్రస్ నుండి వచ్చింది''

''ఏమని...?''

''గుడ్‌బై... దిస్ ఈజ్ మై లాస్ట్ మెసేజ్... ఐయామ్ క్లోజింగ్ దిస్ అకౌంట్. డోంట్ ట్రై ఫర్ మి'' అని మాత్రమే వుంది అందులో.

''దట్స్ ఇట్... కంగ్రాచ్యులేషన్స్''

ఇంతలోనే ముకుంద నుండి ఫోన్ వచ్చింది.

''అన్నయ్యా... డబ్బులు ఏం చేశాడో అడిగారా?''

''ఏం లేదమ్మా.. నీకు తెలియకుండా ఒక మాంచి ప్లాట్ కొని నీకు సర్‌ప్రయిజ్ గిఫ్ట్ ఇద్దామని ఇంత గందరగోళం సృష్టించాడు'' అన్నానామెతో...

''ఎంతయినా మా ఆయన బంగారం'' అనేసి ఫోన్ పెట్టేసింది.

* * *

నెలరోజుల తరువాత సుధాకర్ నూతన గృహ ప్రవేశం జరిగినరోజు రాత్రి దాబా హోటల్‌లో కూర్చున్నాము నేనూ, సుధాకర్, దస్తగిరి.

''అసలు విషయమేంటి సార్'' అడిగాడు దస్తగిరి.

సుధాకర్‌కేసి తిరిగి చెప్పాను.

''అసలు మార్తాకు, నీకు మధ్యలో జరిగిన యవ్వారమంతా నడిపింది ఎవరో మూడో వ్యక్తి... వాడిని మనం ఎక్స్ అనుకుందాం. వాడు సరదాగా ఒక ఆట మొదలెట్టాడు. దానికి రెండు పాత్రలను ఎన్నుకున్నాడు అది నువ్వూ, మార్తా...ఒక ఇమెయిల్ అకౌంట్ ఓపెన్ చేసి దానిని మీ ఇద్దరికి ఇచ్చాడు. నువ్వు, మార్తా ఇద్దరు కూడా ఒకరికొకరు పంపుకునే మెస్సేజ్‌లు నేరుగా అందలేదు. అవి ముందుగా వాడి అడ్రస్‌కు వెళ్ళి అక్కడినుండి రిడైరెక్ట్ అయి మీకు చేరేవి. అదే అడ్రస్‌ను మార్తాదిగా నువ్వు, నీదిగా మార్తా భావిస్తూ వచ్చారు. మీరు పంపుకునే మెస్సేజ్‌లన్నీ వాడు చదువుకుంటూ ఎంజాయ్ చేసేవాడు. వీలైతే చిన్న చిన్న మార్పులు చేసి మీకు పంపేవాడు''.

నోరు తెరిచి వింటూండిపోయారిద్దరూ.

''ఇలా వుండగా ఒకరోజు హఠాత్తుగా మార్తా లండన్‌ను వదిలి మరోచోటికి వెళ్ళిపోయింది. అప్పుడు ... ఆ క్షణాన తాను సరదాగా ఆడుతున్న ఆట ద్వారా లబ్ధి పొందాలనుకున్నాడు వాడు...అందుకే మార్తా చనిపోయినట్లుగా జాన్సన్ పేరుతో మరో అకౌంట్ ఓపెన్ చేసి కొత్త నాటకానికి తెరతీశాడు. ఆ నాటకంలో భాగంగా సాలెగూటిలో చిక్కిన శలభంలా విలవిల్లాడిపోయావు నువ్వు. నిజానికి ఇందులో ఎవరి ప్రాణాలూ పోలేదు. ఏ నేరమూ జరగలేదు''.

''మైగాడ్'' గట్టిగా అరిచాడు సుధాకర్.

''మరి వాడు చివరి మెసేజ్ అలా ఎందుకు పంపాడు సార్'' అడిగాడు దస్తగిరి.

''ఈ రెండు రోజుల్లో ఇదే ఇంటర్‌నెట్ ద్వారా నేను లండన్ నగరాన్నంతా చుట్టి వచ్చాను. కాని ఈ ఎక్స్ అనేవాడు చాలా తెలివైనవాడు అని రెండు రోజుల్లోనే తెలిసింది. చివరకు వాడాడిన నాటకాన్ని యథాతథంగా వాడికే త్రిప్పికొడుతూ నేనిచ్చిన పంచ్ వాడిని దిమ్మతిరిగిపోయేలా చేసింది. చేసేది లేక వాడు తన లాస్ట్ మెసేజ్ ద్వారా ఈ నాటకానికి తెరదించాడు''.

''ఏంటిసార్ ఆ పంచ్'' అడిగాడు దస్తగిరి.

''నీ వేదనలు భరించలేక సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు నీకోసం వెతుకుతున్నారు అని జాన్సన్ అడ్రస్‌కు మరో కొత్త ఇమెయిల్ అడ్రస్ ద్వారా మెసేజ్ పంపాను.''

''వాడు నమ్మాడా?''

''వాడు నమ్మడు... కాని వాడి నాటకాన్ని మనం గుర్తించామని మాత్రం గ్రహిస్తాడు''.

''ఎంతైనా మీరు మీరే సార్'' అన్నాడు దస్తగిరి.

''అంతేకాదు నా చిన్న తొందరపాటు వల్ల ఒక క్రిమినల్‌ను స్వేచ్ఛగా వదిలేశానేమో అని బాధగా వుంది. ఏది ఏమైనా ఇంత రసవత్తరమైన నాటకానికి ఆద్యుడైన రే టోమ్లిసన్‌కు మాత్రం జోహారు''.

''అతనెవరు సార్''

''1971లో ఇ-మెయిల్‌ను రూపొందించిన వ్యక్తి.''

★



## అభిషేక్ గోడు

'రోజుకి పద్నాలుగు గంటలు పనిచేస్తున్నాను. పర్సనల్ లైఫ్‌కి టైమే లేదు. ఇక పెళ్ళి గురించి ఎక్కడ ఆలోచించేది. నా పనిగంటల్ని అర్థం చేసుకునే అమ్మాయి దొరకాలిగా' కరిష్మాతో తెగతెంపులైనప్పటినుంచి అభిషేక్ ఇలా మాట్లాడుతున్నాడు. ఎన్ని గంటలు పని చేస్తావన్నది ఇండస్ట్రీలో ఎవరికీ అక్కరలేదు. సినిమా హిట్టా ఫ్లాపా అనేది చూస్తారు. అభిషేక్‌కి బ్రేక్ ఎప్పుడొస్తుందో ఏమో!